ప్రజాశక్తి
ఆదివారం 25 మే 2025
5
పార్వతీపురం మన్యం

ఎన్‌సిడి, ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం అధికారిగా డాక్టర్ జగన్మోహన్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎన్‌సిడి, ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం అధికారిగా డాక్టర్ టి.జగన్మోహనరావు నియామకానికి సంబంధించి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు శుక్రవారం సాయంత్రం ఆయనకు ఉత్తర్వులను అందజేశారు. కమిషనర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం నుంచి పొరుగు సేవల ప్రాతిపదికన డాక్టర్ జగన్మోహన్‌రావును ఎన్‌సిడి, ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం అధికారిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. గతంలో డిఐఒ, డిఎంఒ, డిప్యూటీ డిఎంహెచ్ఒ ఇన్‌ఛార్జిగానూ, పలు ఆరోగ్య కార్యక్రమాలకు ప్రోగ్రాం అధికారిగా జగన్మోహన్‌రావు జిల్లాలో పనిచేశారు. జీవనశైలి, వ్యాధుల నియంత్రణ, స్కూల్, అంగన్వాడీ పిల్లల మెరుగైన ఆరోగ్యానికి కృషి చేయాలని డిఎంహెచ్ఒ ఆయనకు సూచించారు.

ఆదివాసీ ఆరోగ్య సేవలు అందేనా?

- ఆరేళ్లుగా సేవలు కరువు
- మరో పది రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం
- ఏటా ఆగని విద్యార్థుల మరణాలు
- మంత్రి హామీ అమలు ఎప్పుడో?

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు వైద్యసేలందిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు (ఫైల్)

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలోని పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 55 ఆశ్రమ పాఠశాలలు, సీతంపేట ఐటిడిఎ పరిధిలో43 ఆశ్రమ పాఠశాలల్లో వేలాదిమంది విద్యార్థులు చదువుతున్నారు. నిత్యం విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతూ సమీపంలోని ఆసుపత్రులకు వెళ్లడం పరిపాటిగా మారింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యం కోసం వస్తున్న వారిలో ఎక్కువమంది విద్యార్థులు కనిపిస్తున్నారు. ఏటా జూన్ నుంచి కురుస్తున్న వర్షాలకు విద్యార్థులు వ్యాధులు బారిన పడుతున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందక ప్రతి ఏడాది పదుల సంఖ్యలో మరణాలు జరుగుతున్నాయి. అయినా పాలక ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు వీటి నివారణా చర్యలు చేపట్టడంలో శ్రద్ధ వహించడం లేదు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు స్థానికంగా వైద్యం అందించే ఆరోగ్య సిబ్బంది లేకపోవడంతో సకాలంలో వైద్యం అందక విద్యార్థులు మరణిస్తున్నారని పలుమార్లు గిరిజన సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థులకు పౌష్టికాహారం అందడంలేదని, విద్యార్థుల్లో రక్తహీనత ఎక్కువగా కనిపిస్తుందని గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు. ప్రతి ఏటా మన్యం జిల్లాలో వందలాది మంది విద్యార్థులు అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చేరడం పరిపాటిగా మారుతుంది. ఎంతో ఆసక్తితో చదువుకోడానికి వచ్చిన విద్యార్థులు అనారోగ్యానికి గురవ్వడంతో చదువుకు దూరమవుతున్నారు. చదువుకోడానికి వచ్చిన విద్యార్థులు ఏదో ఒక కారణం చేత పసిప్రాయంలోనే మృత్యు ఒడికి చేరుతూనే ఉన్నారు. విద్యార్థులు మరణించిన సందర్భాల్లో మాత్రమే జిల్లాస్థాయి, ఐటిడిఎ అధికారులు ఆశ్రమ పాఠశాలల పరిశీలన వరకే పరిమితం కావడం కనిపిస్తోంది.

ఈ విద్యా సంవత్సరం లోనైనా గిరిజన విద్యార్థులకు ఆదివాసీ ఆరోగ్య సేవలు అందేనా? అన్న ప్రశ్న విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నాయకులు నుంచి వ్యక్తమౌతుంది. గత ఐదారు ఏళ్లుగా ఆశ్రమ పాఠశాలల్లో ఆదివాసీ ఆరోగ్య సేవలు నిలిచిపోవడంతో స్థానికంగా విద్యార్థులకు వైద్యం ఆందని ద్రాక్షగా మారింది. టిడిపి ప్రభుత్వం నియమించిన ఆరోగ్య కార్యకర్తలను గత వైసిపి ప్రభుత్వం తొలగించింది. నాటి నుంచి నేటి వరకు ఆరోగ్య సేవకులను నియమించకపోవడంతో విద్యార్థులకు అనారోగ్యం వాటిల్లితే పాఠశాల సిబ్బంది సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకువెళ్లి వైద్యం అందిస్తున్న పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య కార్యకర్తలను నియమిస్తామని స్వయంగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మొదటి సంతకం చేసి ప్రకటించారు. ఈ విద్యా సంవత్సరం మరో 10 రోజుల్లో ప్రారంభం కానుంది. జూన్ 12 నుంచి పాఠశాలల పునః ప్రారంభం కానున్నాయి. కానీ నేటి వరకు ఆరోగ్య కార్యకర్తల నియామకం పై ఎటువంటి చర్యలు కనిపించలేదు.

గతంలో అయితే నెల రోజుల్లో నాలుగైదు ఆశ్రమ పాఠశాలలను డిడి, పిఒ స్థాయి అధికారులు సందర్శించే సందర్భాలు ఉండేవి. విద్యార్థుల మరణాలు అరికట్టడం, మరణాలకు గల కారణాలు వంటి వాటిపై విశ్లేషణ చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా కొరవడింది. దీంతో విద్యార్థులు ఏడాది పొడవునా ఏదో ఒకచోట చనిపోతూనే ఉన్నారని గిరిజన సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక నుంచి విద్యార్థుల మరణాలు నివారణకు, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి ఆరోగ్య కార్యకర్తలను తక్షణమే నియమించాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఆరోగ్య కార్యకర్తలను నియమించాలి

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించే దిశగా కూటమి ప్రభుత్వం ఆరోగ్య కార్యకర్తలను నియమించాలి. ఎన్నికల ప్రచార సభల్లో ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. మంత్రి సంధ్యారాణి మొదటి సంతకం ఆరోగ్య కార్యకర్తలను నియమిస్తామని చేసినప్పటికీ నేటి వరకు ఆ ప్రస్తావనే లేకపోవడం విచారకరం. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఆరోగ్య కార్యకర్తలను ప్రభుత్వం వెంటనే నియమించాలి. గిరిజన విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలి.

పాలక రంజిత్ కుమార్
గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు

విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలి

ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించి గిరిజన విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలి. ఎన్నికల సమయాల్లో వాగ్దానాలు చేస్తున్న నాయకులు హామీలు అమలు చేయడం లేదు. ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని ఎన్నోసార్లు ఆందోళనలు చేసినా పాలక ప్రభుత్వాలు కనీసం పట్టించుకోలేదు. ఇప్పటికైనా విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య సేవకులను నియమించాలి. రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలి.

కొల్లి గంగు నాయుడు
సిపిఎం జిల్లా కార్యదర్శి

రక్షణ కరువు

ఎంతో ఆశతో, ఆసక్తితో చదువుకోడానికి వస్తున్న విద్యార్థులు ఆరోగ్యానికి రక్షణ కరువైంది. అనారోగ్యం వాటిల్లితే స్థానికంగా వైద్య సేవలందించే ఆరోగ్య కార్యకర్తలు లేకపోవడం విచారకరం. గత కొన్నేళ్ళుగా ఈ సమస్య ఉన్నా పాలక ప్రభుత్వాలు పట్టించుకునే పాపాన పోలేదు. ఈ విద్యా సంవత్సరం నాటికైనా ఆదివాసీ ఆరోగ్య కార్యకర్తలను నియమించాలి.

మండంగి రమణ ,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి.

విద్యార్థుల సంక్షేమంపై దృష్టి పెట్టాలి

కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. గిరిజన విద్యార్థులకు ఆరోగ్య సేవలు స్థానికంగా అందేలా చర్యలు తీసుకోవాలి. గతంలో పనిచేసిన ఆరోగ్య కార్యకర్తలను తిరిగి నియమించాలి. విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి.

పల్లా సురేష్
గిరిజన విద్యార్థి సంఘం జిల్లా నాయకులు.

ఎమ్మెల్యేపై చైర్‌పర్సన్ ఫిర్యాదు

- మొన్న చుక్క శ్రీదేవి.. నిన్న తహశీల్దార్
- మితిమీరిన దూకుడుతో మసకబారుతున్న టిడిపి ప్రతిష్ట
- అధిష్ఠానం మౌనం అంగీకారమేనా?

ఎస్‌పి మాధవరెడ్డికి వినతిని అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రపై మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి శనివారం జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డికి ఫిర్యాదు చేశారు. శుక్రవారం జరిగిన మున్సిపల్ సాధారణ, బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే విజయచంద్ర తనను సైకో అన్నారని పేర్కొంటూ పిర్యాదు చేశారు. సమావేశంలో పాల్గొన్న ఇద్దరు వైసిపి కౌన్సిలర్లను దౌర్జన్యంగా టౌన్ సిఐ, ఎస్ఐ బయటకు గెంటేశారని చెప్పారు. చైర్‌పర్సన్‌గా తన అనుమతి లేకుండా పోలీసులు సమావేశమందిరంలోకి రాకూడదని చెప్పారు. ఎమ్మెల్యే అండదండలున్నాయని మున్సిపల్ కమిషనర్ కూడా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, రాత్రి 11 గంటల సమయంలో తన ఇంటికి సిబ్బందిని పంపించి అజెండాపై సంతకం చేయాలని ఒత్తిడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మున్సిపాలిటీ వ్యవహారాల్లో ఎమ్మెల్యే బోనెల జోక్యం పెరుగుతుండడంతో చైర్‌పర్సన్‌కు మింగుడు పడడంలేదు. కమిషనర్ వెంకటేశ్వర్లు పూర్తిగా ఎమ్మెల్యే బోనెల కనుసన్నల్లో పని చేస్తుండడం, చైర్‌పర్సన్ సిఫార్సులను బేఖాతరు చేయడం టిడిపి, వైసిపి మధ్య ఆధిపత్యపోరుకు మున్సిపాలిటీ కేంద్రబిందువైంది. పట్టణాభివృద్ధిని, ప్రజాసమస్యలను పట్టించుకోకుండా ప్రధాన పాలక పక్షాలు రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

మొన్న చుక్క శ్రీదేవి, నిన్న తహశీల్దార్

ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత బోనెల విజయచంద్ర మహిళలతో వివాదాలను కొని తెచ్చుకోవడం చర్చనీయాంశమైంది. కొద్ది నెలల క్రితం మండలంలోని పెదబొండపల్లికి చెందిన చుక్క శ్రీదేవి భూముల వ్యవహారంలో ఎమ్మెల్యే తలదూర్చడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగకుండా టిడిపి రాష్ట్ర నాయకత్వానికి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు కూడా ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల క్రితం మండల తహశీల్దార్ జయలక్ష్మి ఆయన వ్యవహారశైలిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి 10 గంటల సమయంలో ఫోన్ చేసి ఎమ్మెల్యే బోనెల తనను బెదిరిస్తున్నారని, వేధిస్తున్నారని తహశీల్దార్ జయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రెండు పిర్యాదులతో ఆయన పేరు నియోజకవర్గం, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మార్మోగింది.

మితిమీరిన దూకుడుతో మసకబారుతున్న టిడిపి

స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మితిమీరిన దూకుడుతో అధికారపార్టీ ప్రతిష్ట మసకబారుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ ప్రయోజనాల కన్నా వ్యక్తిగత ప్రయోజనాలే పరమావధిగా ఆయన అనేక వ్యవహారాల్లో తలదూర్చుతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఆయనపై మహిళ చుక్క శ్రీదేవి, తహశీల్దార్ జయలక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి ఫిర్యాదులు నమోదయ్యాయి. ఎన్నికైన ఏడాదిలోనే ఎమ్మెల్యే బోనెలపై రికార్డు స్థాయిలో మూడు ఫిర్యాదులు పోలీసులకు అందాయి. దీంతో పార్టీ ప్రతిష్ట నియోజక వర్గంలో, జిల్లాలో మసకబారుతున్నదనే ప్రచారం జరుగుతోంది.

అధిష్ఠానం మౌనం దేనికి సంకేతం?

పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే అంశాల్లో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తలదూర్చుతున్నా టిడిపి అధిష్టానం మౌనం వహించడం చర్చనీయాంశమవుతోంది. జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేల్లో బోనెల ఒక్కరే వివాదాస్పద వ్యవహారాల్లో వేలు పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే ఇంత దూకుడుగా వ్యవహరిస్తున్నా అధిష్టానం చూసీ చూడనట్టు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలో కీలక నేత అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ధీమాతోనే ఆయన మితిమీరిన దూకుడు ప్రదర్శిస్తున్నారనే ప్రచారం సాగుతోంది.

జెఎసి ఆధ్వర్యాన 26న ర్యాలీ

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 26న ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో సీతంపేట సంత మార్కెట్ నుంచి ఐటిడిఎ వరకూ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ శ్రీనివాసరావు, మీడియా ప్రతినిధి రామ్మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిఒ 3 స్థానంలో కొత్త చట్టం చేయాలని, ఐటిడిఎ పరిధిలోని అన్ని శాఖల్లో ఖాళీలను గుర్తించి గిరిజనులచే ఆ పోస్టులను భర్తీ చేయాలని తదితర సమస్యలపై ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ర్యాలీలో గిరిజనులంతా హాజరు కావాలని కోరారు.

కోట దుర్గమ్మకు శఠగోపం

ప్రజాశక్తి - పాలకొండ

ఉత్తరాంధ్ర ఆరాధ్యమైన కోట దుర్గమ్మ వారి ఆలయంలో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. పర్యవేక్షించే నాథుడు లేకపోవడంతో కొంతమంది ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏడాదికి రూ.90 లక్షల వరకు ఆదాయం వస్తున్నా ఈ ఆలయంలో యాత్రకు సౌకర్యాలు కల్పించాల్సిన సిబ్బంది ఆలయ ఆదాయాన్ని దారిమళ్లిస్తున్నారు. ఏడాదికి ఖర్చుల రూపంలోనే సుమారు రూ.85 లక్షల వరకు చూపిస్తుండడం పట్ల పలువురు ఆశ్చర్యపోతున్నారు. ఆలయ ఆదాయాన్ని హారతి కర్పూరంలా ఆర్పేయడంతో ప్రతి ఒక్కరూ ముక్కున వేలేసుకుంటున్నారు. అక్కడున్న 14 మంది సిబ్బందికి ఏడాదికి రూ.30 లక్షల వరకు జీతాల రూపంలో చెల్లించగా ప్రభుత్వానికి 30 శాతం పన్ను రూపంలో చెల్లించగా మిగిలిన సొమ్ము అంతా దోచేస్తున్నట్లే తెలుస్తుంది. కండువాల పేరుతో లక్షలాది రూపాయలు నిధులు స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెండర్ వేసి కొనుగోలు చేయాల్సి ఉన్నప్పటికీ సిబ్బంది నిబంధనలను పట్టించుకోకుండా బట్టల షాప్ వ్యాపారులతో కుమ్మక్కయి తప్పుడు బిల్లులతో లక్షల రూపాయలు దారి మళ్లిస్తున్నట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. వేలంపాటలో చేతివాటం, ఆలయ అభివృద్ధికి ఆదాయం సమకూర్చాల్సిన అక్కడున్న సిబ్బంది వేలంపాట్లో చేతివాటం చూపుతున్నట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. ఒకే వ్యక్తికి కొబ్బరికాయలు వేలంతో పాటు చీరల వేలం కూడా అప్పగించడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో బకాయి ఉన్నవారే మళ్లీ బినామీల పేరుతో జనరల్ వేసినప్పటికీ ఆ విషయం దేవాదాయశాఖ అధికారులకు తెలిసినా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక టెండర్ వస్తే దాన్ని ఆమోదించడానికి వీల్లేదు. మళ్లీ టెండర్ పిలవాల్సి ఉన్నప్పటికీ నిబంధనలను పట్టించుకోకుండా ఒక టెండర్‌ను ఆమోదించి కొబ్బరికాయలు వేలం పాటతో పాటు చీరలు వేలం ఖరారు చేయడం పట్ల అధికారులు తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి దీనిపై ఆలయ కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణతో 'ప్రజాశక్తి' మాట్లాడగా ఆలయంలో ఎలాంటి పొరపాట్లు జరిగినా చర్యలు తీసుకుంటానని, వేలంపాట సక్రమంగా జరిగిందని చెప్పారు

బినామీల పేరుతో వేలం పాటలు
లక్షల్లో బకాయిలు

ఇరిగేషన్ కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

రికార్డు రూములో మద్యం తాగుతున్న సూపరింటెండెంట్

రికార్డు గదిలో మద్యం తాగుతున్న సూపరింటెండెంట్ సురేష్

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి ఇరిగేషన్ కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. ఇరిగేషన్ రికార్డులను భద్రపరిచే గది కార్యాలయ మేడపై ఉంది. మేడపై ఉన్న గదిలో ఇరిగేషన్ సూపరింటెండెంట్ సురేష్ నిత్యం మద్యం సేవిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. డ్యూటీ సమయంలో రికార్డు రూములో మద్యం సేవించడంతో తోటి ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సూపరింటెండెంట్ తప్పులను ప్రశ్నిస్తే భయపెడుతున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగులే సర్వర్లు

సూపరింటెండెంట్ సురేష్ మద్యం తాగాలనుకుంటే, అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులే అన్ని ఏర్పాట్లూ చేయాలి. మద్యం తాగేందుకు ఏర్పాట్లు చేయకపోతే వేధిస్తున్నారని కొంతమంది ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రికార్డు రూమును బార్ షాపుగా మార్చివేసి గ్లాసులు, వాటర్ బాటిళ్లు, మద్యం అక్కడ పని చేస్తున్న ఉద్యోగులే సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

రాత్రివేళ వ్యభిచారం!

ఇరిగేషన్ కార్యాలయం మేడపై రాత్రి సమయాలలో వ్యభిచారం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మద్యం తాగి వ్యభిచారం చేస్తున్నట్లు చుట్టుపక్కల ఉన్న వారంతా చెబుతున్నారు. మద్యం సేవించిన సీసాలు, గ్లాసులు, వ్యభిచారం కోసం తెచ్చుకున్న తలగడలు, నిరోధులను ఇళ్లలో పడేస్తున్నారు. దీంతో ఆయా ఇళ్లలో ఉన్నవారు ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని చెపుతున్నారు. ఇరిగేషన్ కార్యాలయంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తోటి ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.

దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటాం

ఇరిగేషన్ కార్యాలయంలో సూపరింటెండెంట్ సురేష్ మద్యం తాగినట్లు తన దృష్టికి రాలేదని ఇరిగేషన్ ఎస్ఇ అప్పారావు చెప్పారు. కార్యాలయంలో మద్యం తాగడం నేరమన్నారు. మద్యం తాగినట్లు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వరద సహాయ కార్మికులను విస్మరించడం అన్యాయం

బట్టల డబ్బులు మంజూరైనా నేటికీ ఇవ్వని పరిస్థితి
టిఎ, డిఎలు వెంటనే విడుదల చేయాలని వినతి

కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు, పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విజయవాడ తుఫాన్ వరద బాధితుల సహాయం కోసం వెళ్లిన మున్సిపల్ పారిశుధ్య కార్మికులను తొమ్మిది నెలలు గడిచినా నేటికీ పట్టించుకోకపోవడం అన్యాయమని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సిఐటియు నాయకులు, కార్మికులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ 2024 సెప్టెంబర్‌లో విజయవాడలో సంభవించిన వరద ముప్పు వల్ల పారిశుధ్యం కోసం పార్వతీపురం మున్సిపాల్టీ నుంచి 20మంది కార్మికులు వెళ్లి 8 రోజుల పాటు విజయవాడ సుందరీకరణలో భాగస్వాములయ్యారని తెలిపారు. ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగా పాల్గొన్న కార్మికులందరికీ సగర్వంగా అభినందించాలని, వారి కృషికి ప్రభుత్వం నుంచి గుర్తింపు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని, ఆ ప్రకటన మూలంగా కార్మికులకు రెండు జతల బట్టల నిమిత్తం డబ్బులు కూడా మంజూరైనట్టు అధికారులు తెలిపారని, వాటిని ఎందుకు ఈనాటి వరకు కార్మికులకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆనాటి వరదల సందర్భంలో బాధితులతో పాటు కార్మికులు కూడా చాలా తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారని, ఆరోగ్యాలు చెడిపోయినా పట్టించుకునే నాథుడే లేకపోయిందని గుర్తు చేశారు. విజయవాడ నుంచి తిరిగి వచ్చే సందర్భంలో కూడా అనారోగ్యాలకు పాల్పడ్డారని, కనీసం సెలవులు కూడా ఇవ్వని పరిస్థితి వచ్చిందని అన్నారు. కరోనా కష్టకాలంలో కూడా రాత్రింబవళ్లు శ్రమను ధారపోశారని, అటువంటి కార్మికులను అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం దారుణమని మండిపడ్డారు. కావున ఇకనైనా వెంటనే స్పందించి కార్మికుల బట్టల నిమిత్తం విడుదలైన సొమ్మును మొత్తం కార్మికులకు అందివ్వాలని, అలాగే టిఎలు, డిఎలు విజయవాడకు రానూ, పోనూ ప్రయాణ చార్జీలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో సమ్మె ద్వారా నిరసన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఎన్.మల్లేష్, జి.గంపస్వామి, ఎం.విద్యాసాగర్, ఎన్.శ్రీను, సిఐటియు నాయకులు పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

సాలూరులో విద్యుత్ కోత ఖరీదు రూ.1.24కోట్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / సాలూరు

బొంకరా మల్లన్న అంటే 'మా ఊరి మిరియాలు తాటికాయంత' అన్నాడట వెనుకటి ఓ వ్యక్తి. అచ్చంగా అలాగే ఉంది సాలూరు శ్యామలాంబ పండగలో విద్యుత్ అంతరాయానికి విద్యుత్ శాఖ (ఎపి ట్రాన్స్‌కో అధికారులు) చెబుతున్న జవాబు. ఈనెల 18 నుంచి 22 వరకు నాలుగు రోజులపాటు ఈ ప్రాంతవాసులు అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే సాలూరు శ్యామలంబం పండగ జరిగిన సంగతి తెలిసిందే. రెండు రోజులపాటు విద్యుత్ కోతతో సాలూరు పట్టణవాసులతో పాటు చుట్టాలు, బంధువులు, స్నేహితులు ఉక్కిరి బిక్కిరి అయిపోయిన సంగతి తెలిసిందే. చాలా ఇళ్లల్లో వంటకు, ఇంకొన్ని ఇళ్లల్లో స్నానాలకు నీళ్లు లేక చుట్టాల వద్ద అభాసుపాలయ్యారు. ఇదే అదునుగా చుట్టరికానికి వచ్చినవారు చిందులు వేయడంతో పండగంటి పూట కూడా నిర్వాహకులు చెవులు మూసుకోవాల్సి వచ్చింది. తీరా ఇందుకు కారణమైన విద్యుత్ శాఖ అధికారుల వివరణ చూస్తే 'కరెంటూ లేదు... రూ.కోట్లు డబ్బులేదు' అన్న విషయం బోధపడుతోంది. పండగలో అత్యంత కీలకమైన మంగళ, బుధవారాల్లో దాదాపు 80శాతం ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఖర్చు మాత్రం విద్యుత్ శాఖ అధికారులు సగటు మనిషికి దిమ్మదిరిగే విధంగా రూ.1.24కోట్లు చూపిస్తున్నారు.

పండగ నిర్వహణకు ప్రభుత్వం తరపున మౌలిక సదుపాయాల కల్పన పేరిట రూ.2కోట్లు మంజూరయ్యాయి. ఇది చాలదన్నట్టుగా ఉద్యోగులు, వ్యాపారులు, చిన్నచిత రాజకీయ నాయకుల నుంచి రూ.కోట్ల రూపాయలు వసూలు కూడా చేశారట. పండగ నిర్వహణ కోసం అధికారిక సమావేశాలు, సమీక్షలు అన్నీ ఇన్నీ కావు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని, ముఖ్యంగా మునుపటి మాదిరిగా విద్యుత్ అంతరాయం లేకుండా రథం తిరిగినచోట పొడుగాటి స్తంభాలు పాతేస్తామని, పండక్కి లక్షలాదిగా వచ్చే జనం అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ఓవర్ లోడ్‌కు తగ్గట్టు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ఏర్పాటు చేస్తామని ఇటు విద్యుత్ శాఖ అధికారులు, అటు స్థానిక ఎమ్మెల్యే, జిల్లాకు చెందిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెగేసి చెప్పారు. దీంతో, ఈసారైన బంధు, మిత్రులతో పండగ సరదాగా సందడిగా చేసుకోవచ్చని భావించిన సాలూరు వాసులు తీవ్ర, కష్టనష్టాలు, అవమానాలు చవిచూశారు. అందుకు తగ్గట్టే జనం వచ్చారు. మంగళవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు చాలా ప్రాంతాలకు విద్యుత్ సదుపాయం లేకపోవడంతో కారుచీకట్లోనే గడపాల్సివచ్చింది. చీకటి మాట అటుంచితే విద్యుత్ అంతరాయం వల్ల నీటి బోర్లు వేయడం సాధ్యం కాలేదు. దీంతో, మంగళవారం సాయంత్రం నుంచే నీటి కష్టాలు మొదలయ్యాయి. పట్టణంలో అసలే ఇరుకు సందులు ఎక్కువ. చిన్నపిల్లలు, ముసలి ముడగలకు సైతం నిద్రలేదు. పోనీ, కల్చరల్ ప్రోగ్రామ్స్ చూసి కాలక్షేపం చేద్దామనుకుంటే వర్షం అంతరాయం కలిగించింది. బుధవారం నీరులేక వంటకాలకు చాలా కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. గారి, బూరి, స్వీట్లు వంటివి పెట్టి ఆప్యాయత ప్రదర్శిద్దామనుకున్నవారు ఒకింత దుఃఖ: దిగమింగారు. చివరికి కాల కృత్యాలు తీర్చుకోవడానికి కూడా వీలుకాని పరిస్థితి ఎదురైంది. ఇదే విషయాలు కమిషనర్ వద్ద ఒకరిద్దరు ప్రస్తావించినా కరెంటు కోతతో తనకేమి సంబంధం అంటూ ఒకింత బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇవ్వడం పట్ల చాలా మంది అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్, తాగునీటి సమస్యను మంత్రి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది తమను గెంటేశారంటూ సాక్షాత్తు ఆమె నివాసం ఉంటున్న రామాకాలనీవాసులే ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు పట్టణంలోని అనేక చోట్ల విద్యుత్ అంతరాయాన్ని నిరసిస్తూ ప్రజలు నిరసనలు తెలిపినా మంత్రి నుంచి సమాధానం కూడా రాలేదు. ఇంత వైఫల్యంగా జరిగినందుకు సిగ్గుతో తలదించుకోవాల్సిన విద్యుత్ శాఖ అధికారులు అధిక లోడ్ నివారణకు, అవసరానికి తగ్గట్టు ముందుస్తు ఏర్పాటు చేశామని, ఎంతో మంది అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా వ్యవహరించామంటూ ఏకంగా ప్రకటన జారీచేయడం పట్ల జనం విస్తుపోతున్నారు. చివరకు మంగళవారం రాత్రి నాటి గాలి వర్షానికి చిన్నపాటి ఇబ్బంది కలిగినట్టు బుకాయిస్తున్నారు. వాస్తవానికి గాలి, వానకు ముందు నుంచే అనేక ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేశారు. దీన్నిబట్టి విద్యుత్ సరఫరా పేరిట కేటాయించిన నిధులు పక్కదారి పట్టినట్టు అర్థమౌతోందని పబ్లిక్ టాక్.

సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎస్‌పి రాంబాబు

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం పోలీస్ స్టేషన్‌ను డిఎస్‌పి ఎం.రాంబాబు శనివారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో గల పెండింగ్ కేసుల రికార్డులు, వివిధ కేసుల రికార్డులు పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి విధులు బాధ్యతలు గూర్చి అవగాహన కల్పించి, స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్విన్ పేట సిఐ బి.హరి, ఎస్ఐ పి.నారాయణ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: వార్షిక తనిఖీలలో భాగంగా ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్‌ను పాలకొండ డిఎస్‌పి రాంబాబు శనివారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో సమావేశమయ్యారు. క్రమశిక్షణగా విధులు నిర్వహించాలని, ఏజెన్సీ పోలీస్ స్టేషన్ల అయినందున మావోయిస్టుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ట్రాఫిక్ ఆంక్షలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఐ హరి, ఎస్ఐలు ఉన్నారు.

తెరుచుకున్న వ్యవసాయ శాఖ కార్యాలయం

తెరుచుకున్న వ్యవసాయశాఖ కార్యాలయం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయం తలుపులు శనివారం తెరచుకున్నాయి. 'ప్రజాశక్తి' శనివారం ప్రచురితమైన వ్యవసాయశాఖ కార్యాలయానికి తాళం తీసేది ఎప్పుడో ? అన్న వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం కార్యాలయాన్ని తెరచి సిబ్బంది, అధికారులు విధుల్లో ఉంటూ రైతులకు అందుబాటులో ఉన్నారు. అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండడంతో రైతులు 'ప్రజాశక్తి'కి అభినందనలు తెలిపారు.

కడకెల్లలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కడకెల్లలో శనివారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపోటు, మధుమేహ, గర్భిణులు, జ్వర పీడుతుల తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.

26న వాహనం వేలం

ప్రజాశక్తి - సీతానగరం

ఈ నెల 26న సోమవారం పార్వతీపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక వాహనాన్ని వేలం పాట వేయనున్నామని ఎక్సైజ్ సిఐ డి పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులందరూ వేలం పాటలో పాల్గొవాలని ఆమె కోరారు.

గురుకుల కళాశాలలో ఇంటర్ సీట్లు పెంచాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలోని ఎపి గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ సీట్లు పెంచాలని, ఈ విద్యాసంవత్సరంలో సీట్లు తక్కువ విద్యార్థులు ఎక్కువగా దరఖాస్తు చేయడంతో మిగిలిన విద్యార్థులకు సీట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్ చెప్పారు. గిరిజన బాలురు, బాలికలు చదువు కొనేందుకు ఇంటర్మీడియట్ విద్యా కళాశాలల్లో అదనంగా సీట్లు పెంచాలని కోరారు.

స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రపై అవగాహన

రామభద్రపురం: వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ సత్యవాణి విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రపై శనివారం అవగాహన కల్పించారు. గాంధీజీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు వంటి నాయకుల కథల పుస్తకాలను ఇచ్చి చదివించారు. అనంతరం మెదడుకు పదును పెట్టే కారమ్స్, లూడో, వైకుంఠ పాళీ వంటి ఆటలతోపాటు వాలీబాల్ ఆడించారు.

ఎజిపిగా సత్యనారాయణ

ప్రజాశక్తి-బొబ్బిలి

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా సీనియర్ న్యాయవాది చెల్లారపు సత్యనారాయణ నియమితులయ్యారు. ఎజిపి నియామక పత్రాన్ని న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి గొట్టాపు ప్రతిమాదేవి అందించారు. ఎజిపిగా నియమించేందుకు సహకరించిన మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, ఎమ్మెల్యే బేబినాయనను కలిసి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు

ఎంఆర్‌పికే మద్యం విక్రయాలు

ప్రజాశక్తి - కురుపాం

నిర్ణీత సమయంలో ఎంఆర్‌పి ధరలకే మద్యం విక్రయాలు చేపట్టాలని ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాలు మేరకు శనివారం సాయంత్రం కురుపాం మండల కేంద్రంలో గల వైన్ షాపులను తనిఖీలు నిర్వహించి సిబ్బందికి ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకే షాపులు తెరిచి ఉంచి ఎంఆర్‌పి ధరలకు మాత్రమే మద్యం అమ్మాలని సూచించామని చెప్పారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సారా రహిత గ్రీన్ విలేజ్ గా రజ్జిలి

మండలంలోని వేగులవాడ పంచాయతీ రజ్జిలి గ్రామాన్ని సారారహిత గ్రీన్ విలేజ్‌గా ప్రకటించినట్లు ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం రజ్జిలిలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి సారా రహిత గ్రీన్ విలేజ్‌గా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలలుగా జరిపిన దాడుల్లో ఈ గ్రామంలో సారా అమ్మకాలు గానీ తయారీ గానీ ఎవరిపై ఎటువంటి కేసులు కూడా నమోదు కాలేదని తెలిపారు. కావున నాటు సారా అమ్మకాలు లేని గ్రామంగా గుర్తించామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.అలివేలు, దత్తత అధికారి వై.కొండలరావు, విఆర్‌ఒ ఎ.రామారావు, గ్రామస్తులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ పారదర్శకత ప్రదర్శిస్తుందా?

◆ పండగ చందాలు, ఖర్చులపై జనంలో చర్చలు ◆ లైటింగ్, ప్రోగ్రాం ఖర్చులపై అనుమానాలు

ప్రజాశక్తి - సాలూరు

శ్యామలాంబ పండగకు సంబంధించిన ఉత్సవ కమిటీ ఏ మేరకు పారదర్శకత ప్రదర్శిస్తుందనే చర్చ పట్టణ వాసుల్లో నడుస్తోంది. పండగను ఘనంగా నిర్వహించాలనే ఉద్దేశంతో భారీగా దాతల నుంచి చందాలు వసూలు చేశారు. మంత్రి సంధ్యారాణి ముఖ్య అనుచరుడు అక్కేన అప్పారావు ఉత్సవ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయనతో పాటు పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, వ్యాపారి ఇండుపూరి నారాయణరావు కమిటీలో కీలకంగా వ్యవహరించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య కూడా కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. కమిటీ చైర్మన్ అక్కేన అప్పారావు, పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, వ్యాపారి ఇండుపూరి నారాయణరావుల పేరిట స్థానిక అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్‌లో ఖాతా తెరిచి వసూలైన చందా డబ్బును జమ చేశారు. ఉత్సవ కమిటీ అంటే రాజకీయాలకు అతీతంగా పట్టణ పెద్దలు, ప్రముఖులతో ఏర్పాటు చేయాలి కానీ కమిటీలో పేరుకు వందల సంఖ్యలో సభ్యులు వున్నప్పటికీ అన్ని వ్యవహారాలు ఆ ముగ్గురి కనుసన్నల్లోనే జరిగాయి. పండగకు సంబంధించిన లైటింగ్, ప్రోగ్రాంలను ఖరారు చేయడం, వాటికి డబ్బులు చెల్లింపుల్లో ముగ్గురే కీలకపాత్ర పోషించారు. ఈ ముగ్గురూ మంత్రి సంధ్యారాణి కనుసన్నల్లోనే పని చేశారు.

పండగ నేపథ్యంలో ఏర్పాటు చేసిన లైటింగ్ (ఫైల్)

ఎంత వసూలు, ఎంత ఖర్చు అన్న దానిపై చర్చ

పండగకు చందాల రూపంలో ఎంత వసూలైంది, ఎంత ఖర్చయిందనే దానిపై ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.70లక్షల మేరకు చందాల రూపంలో వసూలైనట్లు తెలుస్తోంది. ఈ డబ్బులను చాలా వరకు డెకరేషన్, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు కోసం ఖర్చు చేసినట్లు సమాచారం. జబర్దస్త్ ఈవెంట్ షోకు సుమారు ఆరు లక్షలు, పట్టణమంతా లైటింగ్ కోసం రూ.16లక్షలు రూపాయలు ఖర్చు చేశారనే ప్రచారం జోరుగా సాగుతోంది. వాస్తవంగా ఈ రెండు కార్యక్రమాలకు అంత పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని కొంతమంది వాదిస్తున్నారు. లైటింగ్ కోసం ఖర్చు చేసిన సొమ్ములో సగం సొమ్ముతో సొంత లైటింగ్ పరికరాలు కొనుగోలు చేసుకోవచ్చునని చెపుతున్నారు. ఈ విధంగా పండగ కార్యక్రమాలకు సంబంధించిన ఖర్చుల్లో డబ్బులు దారి మళ్ళినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని శ్యామలాంబ ఆలయం, అమ్మవారి గద్దెలున్న జన్నివీధి, పెదకోమటి పేటలో లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పండగ ముగిసి ఐదురోజులు కావస్తున్నా ఇంతవరకు ఉత్సవ కమిటీ సభ్యులు పండగ లెక్కల చిట్టా విప్పలేదు. వసూలు చేసిన ప్రతి రూపాయికీ కమిటీ సభ్యులు లెక్క చూపించాల్సిందేనని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా అధికారుల నుంచి విరాళాలు?

జిల్లాలో వున్న కొన్ని శాఖల అధికారులు కూడా విరాళాలు అందజేసినట్లు తెలుస్తోంది. ఈ విరాళాలు ఉత్సవ కమిటీ వసూళ్ళ లిస్టులో వున్నాయా లేదా అన్న చర్చ జరుగుతోంది. ప్రజల నుంచి వసూలైన చందాలతో పాటు అధికారుల నుంచి అందిన విరాళాలు కలిపితే కోటి రూపాయలు దాటిపోయే అవకాశం ఉంది.

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజా దర్బార్‌లో 17 వినతులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బారులో ప్రజల నుంచి వివిధ సమస్యలు పై 17 వినతులు వచ్చినట్లు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. రహదారులు, తాగునీరు, సాగునీరు తదితర సమస్యలపై ప్రజలు వినతులు అందించినట్లు చెప్పారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే ఫోన్లో అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మరి కొన్ని సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు.

యోగాతో అందరికీ సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

యోగతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21 నుంచి నెల రోజులు పాటు వివిధ యోగా కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు చెప్పారు. శనివారం స్థానిక ఎన్‌జిఒ హెూంలో 50 మంది వైద్య ఆరోగ్య సిబ్బందితో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఢిల్లీ నుంచి విచ్చేసిన యోగా గురువు డాక్టర్ నితిన్ నేతృత్వంలో వర్చువల్ విధానంలో మాస్టర్ ట్రైనీలకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ఈ రోజు యోగాలో మాస్టర్ ట్రైనీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. యోగా మన ప్రాచీన సంస్కృతి, యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఇప్పుడున్న బిజీ షెడ్యూల్‌లో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టడంలేదన్నారు. అందువల్ల చిన్న వయసులోనే మధుమేహం, దృష్టి లోపం వస్తున్నాయని, దీనివల్ల మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటారని, అలసట ఉండబోదని ఉద్భోదించారు. ఈరోజు పాలకొండ, సాలూరులో సుమారు 60మంది మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, జిల్లా ఆయుష్ శాఖ అధికారి సుశీల, యోగా గురువు మోహన్ పాల్గొన్నారు.

పార్వతీపురం: యోగాలో పాల్గొన్న డిఎంఅండ్‌హెచ్ఒ భాస్కరరావు, తదితరులు

సాలూరు: యోగా చేస్తున్న మున్సిపల్ ఆరోగ్య సిబ్బంది

పాలకొండ : స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థ నుంచి ఆన్లైన్ శిక్షణ ద్వారా పాలకొండ, భామిని, సీతంపేట, వీరఘట్ట మాస్టర్ ట్రైనీలకు ఆన్లైన్ ద్వారా శిక్షణ శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ రత్నరాజు, ఎంపిడిఒ విజయ రంగారావు, ఎస్సై ప్రయోగమూర్తి, యోగా గురువు జనార్దన్, పావని సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు : యోగా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ డిటివి కృష్ణారావు ఆధ్వర్యంలో యోగాంధ్ర వేడుకలను శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యోగా వల్ల శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివ కుమార్, యోగా గురువులు, పురపాలక, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎంపిడిఒ జె. ఉమామహేశ్వరి అన్నారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉపాధి హామీ, వెలుగు, సచివాలయ సిబ్బందితో కలిసి యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయల సిబ్బంది ప్రతి ఒక్కరూ పాల్గొని యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కురుపాం: యోగా చేస్తున్న ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది

ప్రణాళికలు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి- పాచిపెంట

గ్రామస్థాయి ప్రకృతి వ్యవసాయ ప్రణాళికలు సిద్ధం చేసి ఈ ఖరీఫ్ సీజన్‌లో అమలు చేసి ఎంతమందిని ప్రకృతి వ్యవసాయం దిశగా మళ్ళించామో గుర్తించి వారిని సత్కరించాలని సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ అన్నారు. మాతమూరు గ్రామంలో సిఆర్పి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళిక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సత్వర సేవలను అందించి రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా మళ్ళించాలని, ముఖ్యంగా వరి, కూరగాయల పంటలపై దృష్టి సారించి పూర్తిస్థాయిలో ప్రకృతి సేద్యం చేసే దిశగా ప్రణాళికలు రూపొందించాలని, రైతులు కూడా ఈ విషయమై సిబ్బందికి సహకరించి ముందుకు రావాలని కోరారు. ప్రకృతి సేద్య ఎంటి యశోదమ్మ మాట్లాడుతూ ప్రకృతి సేద్య 9 సార్వత్రిక సూత్రాలను రైతులు పాటించడం ద్వారా పూర్తిస్థాయి ప్రకృతి ఫలితాలను పొందవచ్చని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు దినేష్ సాగుదారు సాగు హక్కు పత్రాలు తప్పనిసరిగా పొందాలని, అన్నదాత సుఖీభవ పంటల బీమా పంట నష్టపరిహారాలు పంట రుణాలు వంటివి పొందవచ్చని తెలిపారు. అనంతరం రైతులకు మొక్కజొన్న పంటపై వచ్చే కత్తెర పురుగు నివారణ కోసం మహిళా రైతు మర్రాపు త్రివేణి తయారు చేసిన అగ్ని అస్త్రాన్ని పనిచేసే విధానాన్ని రైతులకు వివరించారు. అనంతరం ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలని కోరుతూ పలువురు రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, ఐసిఆర్‌పి కుమార్ రైతులు పాల్గొన్నారు.

అగ్ని అస్త్రాన్ని తయారు చేస్తున్న సిబ్బంది

28న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

తోటపల్లి ఎడమ కాలువ భూములకు సాగునీరందించాలని కోరుతూ ఈనెల 28న సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు అన్నారు. ఈ మేరకు మండలంలోని లుంబూరులో శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శ్రీ కోట దుర్గ ఆలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ప్రదర్శన, అనంతరం అక్కడ జరుగుతుందన్నారు. తోటపల్లి బ్యారేజ్ ఎడమ కాలువ ద్వారా మండలంలో సుమారు 25 గ్రామాలకు సాగునీరందడం లేద న్నారు. కొన్ని ప్రాంతాలకు మొదటి పంటకు కూడా నీరందడం లేదన్నారు. రెండో పంటకు నీరందేలా చర్యలు చేపట్టాలన్నారు. తోటపల్లి ఆయకట్టు రైతులు మే 6న సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చినప్పటికీ నేటికీ అధికార యంత్రాంగంలో కదిలి లేదన్నారు. దీంతో ఈనెల 28లోపు తోటపల్లి ఎడమ కాలువ ఆయకొట్టు రైతులకు సాగునీరు అందించే చర్యలు నిర్దిష్టమైన ప్రతిపాదనలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాజకీయాలకు అతీతంగా ఈనెల 28న రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరుగుతుందన్నారు. కావున ఈ ధర్నాకు రైతులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లుంబురు రైతు నాయకులు పడాల రామచంద్రరావు, చోడవరపు సాంబమూర్తి, గురుగుబిల్లి జగన్నాథం, లోలుగు రాము, పడాల ఉమామహేశ్వరరావు, వావిలపల్లి హరిబాబు, వావిలపల్లి రమణ, వంజరాపు శ్రీనివాస రావు, చాపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతులు

హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే పూర్ణపాడు లాబేసు వంతెన పెండింగ్ పనులు పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం నాయకులు జనార్దన డిమాండ్ చేశారు. శనివారం కూనేరు సంతలో ఈనెల 26వ తేదీన కొమరాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం చేశారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ పూర్ణపాడు లాభేసు వంతెన పెండింగ్ పనులు అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం చేపడతామన్న హామీలను అమలు చేయాలన్నారు. గత ప్రభుతంలో పనులు ప్రారంభించినప్పటికీ కాంట్రాక్టర్‌కు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో పనులను మధ్యలోనే నిలిపేశాడన్నారు. ఈ వంతెన నిర్మాణంపై ఎమ్మెల్యే జగదీశ్వరి అసెంబ్లీలో ప్రస్తావించడం, సిఎం చంద్రబాబు స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ పనులు మాత్రం ముందుకు కదల్లేదన్నారు. వెంటనే ఈ వంతెన పెండింగ్ పనులు పూర్తి చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, ఆ దిశగా ఈనెల 26వ తేదీన సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాల్లో అన్ని వర్గాల ప్రజలూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివునినాయుడు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ పేరిట హత్యలు ఆపాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

చత్తీస్‌గఢ్ అడవుల్లో ఈనెల 21న మావోయిస్టు కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 28 మంది బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవ, కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అటవీ సంపదను, సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికే అర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడిచే హిందూ మతోన్మాద కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలు జరపాలని అనేక మార్లు ప్రకటనలు చేస్తున్నప్పటికీ బిజెపి ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తూ కనీసం స్పందించకపోవడం, పొరుగు దేశమైనా పాకిస్తాన్‌తో చర్చలకు వెళ్లింది కానీ ఈ దేశ పౌరులైనా మావోయిస్టులతో చర్చలు జరపడానికి సంకోచించడం శోచనీయమన్నారు. దేశంలో ప్రత్యామ్నాయ శక్తులను లేకుండా చేయడంలో భాగమే "ఆపరేషన్ కగార్" అని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టు పార్టీతో తక్షణం చర్చలు జరిపి, అడవుల్లో ఉన్న బలగాలను వెనక్కి రప్పించాలని, ఇంతవరకు జరిగిన ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కుండంగి లింగరాజు, పత్రిక లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

సొంత నిధులతో సిహెచ్‌సి అభివృద్ధి

ప్రజాశక్తి-బొబ్బిలి

సొంత నిధులతో సిహెచ్‌సిని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బేబినాయన చెప్పారు. ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని శనివారం సందర్శించి, వైద్యులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తన తండ్రి ఆర్.వి.జి.కె రంగారావు శత జయంతి సందర్భంగా ఆస్పత్రిని సొంత నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఆస్పత్రి అవసరాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని సూపరింటెండెంట్ శశిభూషణరావును కోరారు. ఆస్పత్రిలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు.

చెత్త సేకరణపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో ప్రతిరోజూ క్లాప్ మిత్రుల ద్వారా తడి పొడి చెత్తలను సేకరించేలా సిబ్బంది దృష్టి పెట్టాలని డిప్యూటీ ఎంపిడిఒ టి.రమణమూర్తి నాయుడు సచివాలయాల కార్యదర్శులను ఆదేశించారు. శనివారం స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని చెత్త సంపద కేంద్రంలోని చెత్త సంపద షెడ్ డే సందర్భంగా కార్యదర్శులతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి నాలుగో శనివారం సంపద షెడ్ డే కార్యక్రమం నిర్వహించాలన్నారు. సేకరించిన చెత్తను ఎరువుగా తయారు చేసి ప్రతి గురువారం వాటిని విక్రయాలు చేర్పించడంతో పాటు నిల్వ ఎంత ఉందో అది కూడా తెలియజేయలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షులు బంగారుబాబు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

వీరఘట్టం: సమావేశంలో మాట్లాడుతున్న ఇంచార్జి ఎంపిడిఒ

ఆర్థిక వనరులను సేకరించాలి

సీతానగరం: గ్రామాలలో ఉండే ఎస్‌డబ్ల్యుపి కేంద్రాల ద్వారా ఆర్థిక వనరులను సేకరించాలని ఇఒపిఆర్‌డి కెకె. కుమార్ వర్మ అన్నారు. శనివారం పెదబోగిల చెత్త సంపద కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్రపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ గ్రామాలలో గ్రీన్ అంబాసిడర్లు సేకరించే తడి, పొడి చెత్త ద్వారా సంపద ఏ విధంగా సృష్టించాలో అవగాహన కల్పించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని సచివాలయాలలోనూ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: సమావేశంలో మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి

విద్యార్థులకు ప్రవేశ పత్రాలను అందిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

గురుకులంలో ప్రవేశాలకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల సీతంపేట బాలికల, బాలుర, పెద్దమడి బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదట సంవత్సరం ప్రవేశానికి శనివారం సీతంపేట ఐటిడిఎ సమీపంలో ఉన్న బాలుర గురుకుల కళాశాల ప్రాంగణంలో పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మెరిట్ మార్కులు వచ్చిన విద్యార్థులకు ప్రవేశ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పదవ తరగతిలో వచ్చిన మార్కులు మెరిట్ ఆధారంగా సీట్లు బర్తీ చేయాలని గురుకుల ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. ఈ కౌన్సిలింగ్‌లో డిప్యూటీ డైరెక్టర్ ఎం. అన్నదొర, నోడల్ ప్రిన్సిపాల్ కె కృష్ణ మహన్, ప్రిన్సిపాల్ పి.సూర్యకుమారి, మధు, నీలం నాయుడు, సూపరింటెండెంట్ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.